క్లుప్తంగా

గులాబీ మొక్కల పంపిణీ



సీతారాంపురంలో మొక్కలు పంపిణీ చేస్తున్న రవిబాబు

జలుమూరు: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ ఆహ్లాదకర వాతావరణం ఏర్పాటు చేసుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని సీతారాపురం ఎస్ఎస్ఎస్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, చర్చి పాస్టర్ తమ్మినేని రవిబాబు అన్నారు. ఆదివారం సీతారాంపురం, సోదాం, తలతరియా తదితర గ్రామాల్లో గులాబీ మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కల వల్ల ప్రాణవాయువు లభిస్తుందన్నారు.

ముగిసిన రాజమ్మ సంబరాలు



తిరువీధి నిర్వహిస్తున్న దాసుడు

కొత్తూరు: మండల కేంద్రం కొత్తూరులో మూడు రోజులు నుంచి జరుగుతున్న రాజమ్మ సంబరాలు ఆదివారంతో ముగిశాయి. భక్తులు పెద్ద ఎత్తున హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. రాజమ్మ సంబరాలు నిర్వహించే దాసుడు మంగళవాయిద్యాలతో మండపం వద్దకు చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూడు రోజుల పాటు సంబరాలు ఎంతో సందడిగా జరిగాయి.

జీవామృతం తయారీపై అవగాహన



జీవామృతం తయారు చేయిస్తున్న సూర్యనారాయణ

కొత్తూరు: ప్రకృతి వ్యవసాయంలో భాగంగా మహసింగిగూడలో ఆదివారం జీవామృతం తయారీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాస్టర్ ట్రైనర్ ఎస్.సూర్యనారాయణ మాట్లాడుతూ నాణ్యమైన జీవామృతం వాడటం వల్ల పంటకు ఎక్కువ రోజులు తేమ అందుతుందన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం సిబ్బంది చిన్నమ్మి, ముఖలింగం తదితరులు పాల్గొన్నారు.

సామూహిక ఉపనయనాలు



ఉపనయనాలు నిర్వహించిన శివాజీ పాణిగ్రహి

ఎల్.ఎన్.పేట: మండలంలోని లక్ష్మీనర్సుపేట గ్రామంలో ఆదివారం శివాజీ ఫౌండేషన్ సహకారంతో సామూహిక ఉపనయనాలు ఘనంగా నిర్వహించారు. ఒరియా బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శివాజీ పాణిగ్రహి ఆధ్వర్యంలో ఆంధ్ర, ఒడిశా రాష్ట్రాల నుంచి వచ్చిన ఒరియా బ్రాహ్మణలకు ఉపనయనాలు చేయించామని శివాజీ పాణిగ్రహి తెలిపారు. అనంతరం గ్రామ యువకులతో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

పాతపట్నం సీహెచ్‌సీ సూపరింటెండెంట్‌గా వేణుగోపాల్



పాతపట్నం: పాతపట్నం సామాజిక ఆస్పత్రి(సీహెచ్‌సీ) సూపరింటెండెంట్‌గా చిన్నపిల్లల వైద్యుడు జి.వేణుగోపాల్ నియమితులయ్యారు. ఈయన ఇదే సీహెచ్‌సీలో చిన్నపిల్లల వైద్యుడిగా పనిచేస్తున్నారు. ఇక్కడ సూపరింటెండెంట్‌గా పనిచేసిన సివిల్ సర్జన్ డాక్టర్ ఎస్.కృష్ణారావు విజయనగరం జిల్లా చీపురుపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి బదిలీపై వెళ్లారు.

చిన్నారులకు హార్మోనియం శిక్షణ



శిక్షణలో పాల్గొన్న చిన్నారులు

ఆమదాలవలస: చిన్నప్పటి నుంచే ఆధ్యాత్మికత అలవాటు చేస్తే, పిల్లల మనసు సేవా భావంతో నిండుతుందని సత్యసాయి సేవాసంస్థల రాష్ట్ర విద్యాజ్యోతి కో–ఆర్డినేటర్ ఎస్.గురుప్రసాద్ అన్నారు. ఆమదాలవలసలోని లక్ష్మీనగర్ వీధిలో సత్యసాయి స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్(బాబా మందిరం)లో ఆదివారం సాయిశ్రుతి మందిరం కన్వీనర్ కామావధానులు ఆధ్వర్యంలో చిన్నారులకు ఉచిత హార్మోనియం శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతరించుకుపోతున్న కళలను బతికించేందుకు శిక్షణ ఇస్తున్నామని, అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి కార్యవర్గ సభ్యులు తమ్మన బంగారురాజు, శేషగిరిశాస్త్రి, దామోదర్ తదిరతులు పాల్గొన్నారు.

అందని బిల్లులు.. తీరని అప్పులు!



పాలవలస జెడ్పీహైస్కూల్‌లో వంటలు చేస్తున్న ఏజెన్సీ నిర్వాహకులు

- ఆందోళనలో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు
- బిల్లులు మంజూరు కాక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన



అయ్యవారిపేట ప్రాథమిక పాఠశాలలో భోజనాలు చేస్తున్న విద్యార్థులు

బూర్జ: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం వంట నిర్వాహకులకు నెలలు తరబడి బిల్లులు పేరుకుపోతున్నాయి. దీంతో నిర్వాహకులు ఆర్థిక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. అప్పులు చేసి వండాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆమదాలవలస నియోజకవర్గం పరిధిలో బూర్జ, సరుబుజ్జిలి, పొందూరు, ఆమదాలవలస మండలాలలో 217 మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలు, 25 ప్రాథమికోన్నత, 41 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 1 నుంచి 10వ తరగతుల వరకు 15,773 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరికోసం మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు ఒక్కో మండలానికి ప్రతి నెలా సుమారు రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షలు వరకు ఖర్చు చేస్తున్నారు. గత డిసెంబరు నుంచి మార్చి వరకు 9,10 తరగతులకు, మార్చి నెలలో 1 నుంచి 10 తరగతుల వరకు నిధులు విడుదల చేయలేదు. దీనికి తోడు నిర్వాహకులు ఇచ్చే గౌరవ వేతనాల్లో రూ.1000 బ్యాంకు ఖాతాలో జమచేసి రూ.2 వేలు మంజూరు చేయలేదు. ఈ విషయాన్ని అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదని నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మండలం	పాఠశాలలు	విద్యార్థులు	నిర్వాహకులు	గౌరవ వేతన బకాయిలు (రూ.లక్షలలో)
సరుబుజ్జిలి	53	1,737	74	రూ.5.92 లక్షలు
పొందూరు	70	5,202	160	రూ.12.80
బూర్జ	63	3,534	102	రూ.8.16
ఆమదాలవలస	97	5,300	170	రూ.10.20లక్షలు

నాణ్యతపై ప్రభావం..

పాఠశాలలో మధ్యాహ్న భోజన పథక నిర్వాహకులకు సకాలంలో బిల్లులు, గౌరవ వేతనాలు నెలల తరబడి అందకపోవడంతో మార్కెట్‌లో అప్పు పుట్టని పరిస్థితి నెలకొంది. ఆకు కూరలు, కూరగాయల వ్యాపారులు డబ్బులు ఇవ్వనిదే సరుకులు ఇవ్వడం లేదు. కిరాణా సరుకులదీ ఇదే పరిస్థితి. దీంతో నాణ్యతపై ప్రభావం పడుతోంది.

బిల్లులు చెల్లించాలి..

వంట ఏజెన్సీలకు బిల్లులు పూర్తి స్థాయిలో అందకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మూడు నెలలుగా నెలకు రూ.వెయ్యి మాత్రమే గౌరవ వేతనం అందజేస్తున్నారు. మెనూలో పెంచిన 0.70 పైసలు కూడా అందజేసి మాకు పూర్తి స్థాయిలో బిల్లులు అందించాలి.

– పరిడాల పద్మ, వంట ఏజెన్సీ నిర్వాహకురాలు, టి.ఆర్ రాజుపేట ప్రాథమిక పాఠశాల

బిల్లులు పెట్టాం..

మధ్యాహ్న భోజన పథకం బిల్లులు, గౌరవ వేతనాలు త్వరలోనే వారి బ్యాంకు ఖాతాలలో జమవుతాయి. నిధులు, వేతనాల కోసం బిల్లులు రాసి ఉన్నతాధికారులకు పంపించాం. పాఠశాలలో పిల్లలకు ప్రభుత్వ నిబంధనలు ప్రకారం నాణ్యత కలిగిన భోజనాలు పెట్టాలని సూచించాం.

– ఎస్.శ్యామసుందరరావు, బూర్జ ఎంఈఓ

ఘనంగా ఆంజనేయ విగ్రహ ప్రతిష్టాపనోత్సవం



పూజా కార్యక్రమంలో పాల్గొన్న చింతాడ రవికుమార్

బూర్జ: మండలంలోని వావాం గ్రామంలో జ్ఞాన ప్రసన్న ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్టాపనోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. శుక్రవారం నుంచి ఇక్కడ ప్రతిష్టాపన ఉత్సవాలు జరుగుతున్నాయి. చివరి రోజు భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. వైఎస్సార్ సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్, మండల పార్టీ అధ్యక్షుడు ఖండాపు గోవిందరావు, సర్పంచ్ గొల్వే మంజుల, నాయకులు బొడ్డేపల్లి నాగరాజు, ఏగు రాజారావు, గొల్వే గోపాలం, తొత్తడి సురేష్, చొక్కర కృష్ణమోహన్, మజ్జి నర్సింగరావు, పోతిన రమేష్, కర్రి మల్లేష్, చింతల విశ్వనాధం, దొంతం శేషగిరి, నక్క సన్యాసిరావు, గిరిజాల రామారావు తదితరులు హాజరయ్యారు.

ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు



కొత్తూరు: అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపకాధికారి బుచ్చోడు



ఆమదాలవలస: మాట్లాడుతున్న ఫైర్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ కె.అప్పారావు

కొత్తూరు: ఈ నెల 14న ప్రారంభమైన అగ్నిమాపక వారోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. కొత్తూరు అగ్నిమాపక శాఖాధికారి బుచ్చోడు ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులతో అవగాహన సదస్సు నిర్వహించారు. గ్యాస్ పొయ్యిలపై వంట చేసేటప్పుడు అజాగ్రత్తగా ఉండవద్దన్నారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు

ఆమదాలవలస: అగ్ని ప్రమాదాలను ముందస్తుగా నివారించేందుకు ప్రతి ఇంట్లో చిన్నపిల్లలు నుంచి తల్లిదండ్రులు వరకు బాధ్యత వహిస్తూ అవగాహన కలిగి ఉండాలని ఆమదాలవలప అగ్నిమాపక కేంద్రం ఏహెచ్‌ఓ కె.అప్పారావు అన్నారు. స్థానిక అగ్నిమాపక కేంద్రం ఆవరణలో ఆదివారం అగ్నిమాపక వారోత్సవాలు ముగింపు సభ నిర్వహించారు. కార్యక్రమంలో వేదపండితులు భాస్కరశర్మ, అంగన్‌వాడీ, ఆశవర్కర్లు, ఫైర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సారవకోటలో దాహం కేకలు



ఉజ్జయినీ మహంకాళీ ఆలయ సమీపంలో నిర్మించిన వాటర్ ట్యాంక్

సారవకోట: మండల కేంద్రం సారవకోటలో తాగునీటి ఎద్దడి నెలకొంది. గత ఏడాది అక్టోబర్ నుంచి వర్షాలు లేకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. బోర్లు అంతంత మాత్రంగా పనిచేస్తున్నాయి. రక్షిత మంచినీటి పథకం శిథిలావస్థకు చేరుకోవడంతో రెండు, మూడు రోజులకు ఒకసారి అరగంట సేపు మాత్రమే తాగునీటిని సరఫరా చేస్తున్నారు. శ్రీముఖలింగం ఫేజ్–2 రక్షిత మంచినీటి పథకం కోసం ఉజ్జయిని మహంకాళీ ఆలయం సమీపంలో రెండు నీటి ట్యాంకులు ఏర్పాటు చేశారే తప్ప నేటికీ ఆ పనులు పూర్తికాక పోవడంతో తాగునీటి సరఫరా జరగడం లేదు. దీంతో నీటి సమస్య రోజురోజుకూ తీవ్రతరమవుతోంది. ఇప్పటికైనా పాలకులు స్పందించి తాగునీటి సమస్యపై దృష్టి సారించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అధ్వాన రహదారితో అవస్థలు



వంజంగి–కట్టుముడిపేట గ్రామాల రహదారి దుస్థితి

ఆమదాలవలస రూరల్: మండలంలోని వంజంగి, కట్టుముడిపేట గ్రామాలకు వెళ్లే రహదారి అధ్వానంగా మారింది. దీంతో రాకపోకలకు ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇదే రహదారి గుండా అనేక గ్రామాలకు చెందిన ప్రజలు ఇటు ఆమదాలవలస, అటు శ్రీకాకుళం ప్రాంతాలకు ప్రయాణం సాగిస్తుంటారు. ముఖ్యంగా పాఠశాల, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు నరకయాతన పడుతున్నారు. రహదారి పొడవునా గోతులు ఏర్పడటంతో అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.



వెంకటాపురం చెరువు వద్ద మలుపు

ప్రమాదకరంగా మలుపు

కొత్తూరు: వసప–మెట్టూరు రోడ్డులో వెంకటాపురం చెరువు వద్ద మలుపు ప్రమాదాలకు నిలయంగా మారింది. ఇక్కడికి వచ్చేసరికి వాహనాలను అదుపు చేయలేక తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. దీనికితోడు రోడ్డుకు ఇరువైపులా పిచ్చిమొక్కలు ఉన్నందున ఆ ప్రాంతం ప్రమాదకరంగా మారింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మలుపు వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

రోగులకు పండ్లు వితరణ

పాతపట్నం: సీఎం చంద్రబాబు పుట్టిన రోజు సందర్భంగా పాతపట్నం సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు ఆదివారం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ముందుగా నీలమణిదుర్గ ఆలయంలో సీఎం పేరిట ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నరసన్నపేట: ఉర్లాం సబ్‌స్టేషన్ పరిధిలోని చోడవరం ఫీడర్‌లో ఆర్‌డీఎస్ఎస్ పనుల్లో భాగంగా సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ బాలకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. నడగాం నుంచి చోడవరం , గొనబుప్పేట నుంచి సుందరాపురం వరకు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ విద్యుత్ కోత అమల్లో ఉంటుందని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

బాలికల భద్రతపై అవగాహన

సారవకోట : మహిళలు భద్రత పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ అనిల్‌కుమార్ అన్నారు. ఆదివారం సారవకోట కేజీబీవీ పాఠశాల ఆవరణలో సలహాల పెట్టె ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ బాలికలకు భద్రత విషయంలో ఎటువంటి ఇబ్బందులు ఉన్నా బాక్స్‌లో వేయాలని సూచించారు. ప్రస్తుతం సైబర్ ఉచ్చులో పడి యువత, అమ్మాయిలు ఏ విధంగా బలైపోతున్నారో వివరించారు. కార్యక్రమంలో పోలీసులు, కేజీబీవీ సిబ్బంది పాల్గొన్నారు.

ఏకలవ్య విద్యార్థుల ప్రతిభ

మెళియాపుట్టి: మండలకేంద్రం మెళియాపుట్టిలోని ఏకలవ్య పాఠశాలలో చదువుతున్న ఆరుగురు విద్యార్థులు జేఈఈకి ఎంపిక కావడం సంతోషంగా ఉందని ప్రిన్సిపాల్ రాధాకృష్ణ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సవర అంజలి, సవర సుస్మిత, యశ్వంత్ సాయి, గూడ మౌనిక, సవర ఉమాశంకర్, జ్ఞానేశ్వరరావులు ఎంపికయ్యారని చెప్పారు. అదేవిధంగా, ఏకలవ్య పాఠశాలలో 2025–26 విద్యా సంవత్సరంలో 6వ తరగతిలో ప్రవేశాలకు ఇదివరకే నిర్వహించిన పరీక్షల ఫలితాలు విడుదల చేశామని, అర్హులు ఈ నెల 30లోపు ధ్రువపత్రాలు తీసుకుని పాఠశాలకు హాజరై సీట్ రిజర్వ్ చేసుకోవాలని సూచించారు. 30వ తేదీ దాటిన తర్వాత సీటు రద్దు చేస్తామని స్పష్టం చేశారు.

చెత్త తరలింపులో నిర్లక్ష్యం



చెత్తను తీసుకెళ్తున్న వాహనం

ఆమదాలవలస: మున్సిపాలిటీలోని పలు వార్డులలో సేకరించిన చెత్తను పట్టణ శివార్లలో డంపింగ్ యార్డుకు ట్రాక్టర్లకు తరలిస్తున్నప్పుడు కొందరు సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. వాహనంలోని చెత్త కిందకు పడకుండా టార్పాలిన్, వలలు వంటివి ఏర్పాటు చేయకపోవడంతో ఎక్కడపడితే అక్కడే చెత్త జారిపోతోంది. దీంతో దుర్వాసన వెలువడుతుండటంతో వాహనచోదకులు, స్థానికులు అసౌకర్యానికి గురవుతున్నాకరు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వాహనాల్లో చెత్త తరలించేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని పట్టణవాసులు కోరుతున్నారు.


మండుటెండలో ఉపశమనం



మెళియాపుట్టి– టెక్కలి రోడ్డు లో మర్రిపాడు 'సి' గ్రామం వద్ద రహదారికి ఇరువైపులా తురాయి చెట్లు ఆహ్లాదకరంగా దర్శనమిస్తున్నాయి. పచ్చదనం, చక్కటి పూల పరిమళాలతో చెట్లు కనువిందు చేస్తున్నాయి. మండుటెండలో ప్రయాణించే బాటసారులు, వాహనచోదకులకు ఉపశమనం కలిగిస్తున్నాయి.

- మెళియాపుట్టి

పొంచి ఉన్న ప్రమాదం



ఆమదాలవలస పట్టణ శివారు ప్రాంతంలో వెంగళరావు కాలనీ వద్ద రహదారి పక్కనే ఉన్న రక్షిత మంచినీటి పథకం శిథిలావస్థకు చేరుకుంది. రహదారిని ఆనుకుని ఇది ఉండటంతో ఎప్పుడు కూలుతుందోనని వాహనచోదకులు భయాందోళన చెందుతున్నారు. ఇదే దారిలో కనుగులవలస, తమ్మయ్యపేట, కంచరాపువానిపేట, ముద్దాడపేట, పీరుసాహెబ్‌వానిపేట తదితర గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ప్రమాదం జరగకముందే రక్షిత పథకం తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

- ఆమదాలవలస రూరల్

కుళాయిలకు మోక్షమెప్పుడో?



గొట్టిపల్లి పంచాయతీలో జల జీవన్ మిషన్‌లో భాగంగా ఇంటింటికీ వేసిన కుళాయిలు దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. చుక్కనీరు కూడా రాకపోవడంతో తాగునీటికి గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. వేసవి నేపథ్యంలో త్వరగా పనులు పూర్తి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

-నరసన్నపేట

ఎత్తిపోతల పథకం పనులు పూర్తి చేయాలి



రైతులతో మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు

పొందూరు: మండలంలోని తండ్యాం ఎత్తిపోతల పథకం పనులను వెంటనే పూర్తి చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి మోహనరావు డిమాండ్ చేశారు. ఆదివారం తండ్యాంలో రైతు సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించిన సందర్భంగా మాట్లాడారు. 2019లో ప్రారంభించిన తండ్యాం ఎత్తిపోతల పథకం నేటికి పూర్తి చేయపోవడం పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. దీనివల్ల తండ్యాం, గారపేట, మలకాం, బాణాం, పొందూరు తదితర గ్రామాల్లో సుమారు 5 వేల ఎకరాలకు సాగునీరు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10 నెలలు గడిచినా పనులు చేపట్టకపోవడం తగదన్నారు. కార్యక్రమంలో ఎం.రాములు, కె.సూర్యారావు, ఎం.అప్పలరాజు, కె.అప్పాలరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ విద్య



జలుమూరు: కరకవలసలో ప్రచారం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు



నరసన్నపేట: ముషిడిగట్టు స్కూల్లో చేరికకు అంగీకరిస్తున్న విద్యార్థి కుటుంబ సభ్యులు

నరసన్నపేట: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలకు సంబంధించి ఉపాధ్యాయులు, సీఆర్పీలు గ్రామాల్లో డ్రైవ్ నిర్వహిస్తున్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి మంచి స్పందన వస్తుండటంతో ఆదివారం కూడా స్పెషల్ డ్రైవ్ కొనసాగించారు. తామరాపల్లి, ముషిడిగట్టులో ఉపాధ్యాయులు, సీఆర్పీలు ఇంటింటికీ వెళ్లి విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. సోమవారం నుంచి పాఠశాలల్లో విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ శాంతారావు తెలిపారు.

జలుమూరు: ప్రభుత్వ బడుల్లో చదివితే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని కరకవలస ప్రాథమిక పాఠశాల హెచ్ఎం ఈశ్వరరావు అన్నారు. ఆదివారం కరకవలసలో ప్రచారం నిర్వహించారు. అత్యుత్తమ విద్యా బోధనతో పాటు పుస్తకాలు, యూనిఫామ్, మధ్యాహ్న భోజనం వంటి సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికత అలవరుచుకోవాలి



మాట్లాడుతున్న సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు రామచంద్రరావు

బూర్జ: మానవ జన్మ సార్థకం చేసుకునేందుకు ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికత అలవరుచుకోవాలని సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు సూర రామచంద్రరావు అన్నారు. బూర్జలోని సాయి గీతా మందిరంలో సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో ఆదివారం 22వ పర్తియాత్ర సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ భక్తిభావం కలిగి ఉండాలన్నారు.

కార్యక్రమంలో జోనల్ కన్వీనర్ ఎం.జనార్దనరావు, జిల్లా గ్రామ సేవా ఇన్‌చార్జి ఎం.రవీంద్రబాబు, సభ్యులు రమణమూర్తి, ఎల్.చంద్రశేఖర్, బోగి రామారావు, గౌరీశంకర్, కె.వెంకట్రావ్ తదితరులు పాల్గొన్నారు.